క్లుప్తంగా

3 నుంచి పింఛన్ పంపిణీ

బత్తలపల్లి: ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలోనూ, బ్యాంకులు మార్చి 31, ఏప్రిల్ 1న పని చేయనికారణంగా ఒకటో తేదీ పంపిణీ చేయాల్సిన వైఎస్సార్ పింఛన్ కానుకను మూడో తేదీ నుంచి పంపిణీ చేయనున్నారు. ఇదే విషయాన్ని ఎంపీడీఓ శివనాగప్రసాద్ బుధవారం మీడియాకు వెల్లడించారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



బండి ఆదెప్ప కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, శాంతమ్మ

కనగానపల్లి: ప్రమాద బాధిత కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడు అండగా ఉంటామని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని చంద్రాచర్ల గ్రామంలో బుధవారం పర్యటించిన ఆయన 15 రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బండి ఆదెప్ప కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ తరఫున ఆర్థికసాయం అందిస్తామని తెలిపారు. దీంతో పాటు ప్రభుత్వం నుంచి కూడా పరిహారం అందేలా చూస్తామన్నారు. ఇక ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగభూషణ కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కాటమయ్యస్వామి గ్రామోత్సవం

బత్తలపల్లి: సంజీవపురం సమీపంలోని కాటి కోటేశ్వరుని క్షేత్రంలో నాలుగు రోజులు పాటు భక్తులకు దర్శనమిచ్చిన కాటమయ్యస్వామి ప్రభను గ్రామ పెద్దలు, ఆలయ ధర్మకర్తలచే మంగళవారం రాత్రి స్వామి మూలస్థానమైన ఈదుల ముష్టూరుకు తరలించారు. తెల్లవార్లూ గ్రామోత్సవం నిర్వహించారు. బుధవారం గ్రామంలో కొలువుదీరిన కాటమయ్యస్వామికి గ్రామస్తులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం జంతుబలులు నిర్వహించారు. దీంతో ఉత్సవాలు ముగిశాయి.

విచారణ పూర్తయ్యే వరకూ నిర్మాణం చేపట్టొద్దు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లే దారిలో ఎలాంటి నిర్మాణం చేపట్టొద్దని అశ్వర్థమ్మ అనే మహిళను తహసీల్దార్ హమీద్‌బాషా ఆదేశించారు. ఇటీవల ఇంటి నిర్మాణం చేపడుతున్నట్లు స్థానికులు గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్యామల, వీఆర్‌ఓ తులశమ్మ దృష్టికి వెళ్లగా పనులకు అడ్డుకున్నారు. స్థలానికి సంబంధించిన పత్రాలు చూపాలని అశ్వర్థమ్మకు సూచించారు. విచారణ పూర్తి అయ్యే వరకూ నిర్మాణం జరగకుండా చూడాలని వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శికి తహసీల్దార్ సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దుద్దుకుంట పరామర్శ



పరామర్శిస్తున్న దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ఓడీచెరువు : తంగేడుకుంట పంచాయతీ నల్లచెరువుపల్లి వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్కసాని సూర్యప్రభాకర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గోరంట్లలోని నివాసంలో సూర్యప్రభాకర్‌రెడ్డిని పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. దుద్దుకుంట వెంట జెడ్పీటీసీ దామోదర్‌రెడ్డి, కన్వీనర్ రాజు నాయుడు, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆనందరెడ్డి, బూత్ లెవెల్ మేనేజర్ గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు హనుమంతరెడ్డి, కుర్లి నరిసిరెడ్డి, కుర్లి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సుపరిపాలన



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో అపర్ణారెడ్డి

నల్లమాడ: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తేనే సుపరిపాలన సాధ్యమవుతుందని ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి భార్య దుద్దుకుంట అపర్ణారెడ్డి పేర్కొన్నారు. కురుమాల పంచాయతీ చౌటకుంటపల్లిలో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలు అందజేశారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. సర్పంచ్ లింగమూర్తి, నాయకులు పీపీ భాస్కర్‌రెడ్డి, బీసీ విభాగం మండల అధ్యక్షులు రవిప్రకాష్, ఎనమల కేశవరెడ్డి, రంగారెడ్డి, మోహన్‌రెడ్డి, శివారెడ్డి, రాజారెడ్డి, క్రిష్టారెడ్డి, వనం శ్రీనివాసరెడ్డి, గోపాల్‌రెడ్డి, ప్రతాప్‌నాయక్, దుద్దుకుంట రాజేశ్వరమ్మ, సరళ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్ జగనే సీఎం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలకూ న్యాయం
- ఎన్నికల ప్రచారంలో రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ



దాదులూరులో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, చిత్రంలో శాంతమ్మ,



మామిళ్లపల్లి బహిరంగ సభకు హాజరైన జనం

కనగానపల్లి: సంక్షేమ రాజ్యం కోసం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ తెలిపారు. కనగానపల్లి మండలంలో బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తదితరులతో కలిసి వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉదయం పర్వతదేవరపల్లిలో మొదలైన ఎన్నికల ప్రచారం దాదులూరు, కుర్లపల్లి, కుర్లపల్లి తండాల మీదుగా మామిళ్లపల్లి వరకూ రాత్రి 8 గంటల వరకూ సాగింది. ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలిపించాలని కోరారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలి

రాప్తాడు నియోజక వర్గంలో పల్లెలు ప్రశాంతంగా ఉండాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తిరిగి వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కోరారు. మామిళ్లపల్లిలో సాయంత్రం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. 25 ఏళ్ల పరిటాల కుటుంబ సభ్యుల పాలనలో సాగిన ఫ్యాక్షన్ రాజకీయాలతో ఈ ప్రాంతం హత్యలు, దోపిడీలతో అట్టుడికిపోయిందన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారన్నారు. పేరూరు డ్యాంకు కృష్ణా జలాలు తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశామన్నారు. పేద రైతులకు ఉచితంగా బోర్లు వేయించడంతో పాటు మహిళల జీవనోపాధికి పాల డెయిరీని ఏర్పాటు చేయించామన్నారు. నియోజకవర్గాని ఫ్యాక్షన్ కు దూరంగా అభివృద్ధి వైపు నడిపిస్తుంటే, పరిటాల కుటుంబ సభ్యులు ఎన్నికల ప్రచారంలో ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడుతూ గ్రామాల్లో భయాందోళనలు సృష్టించాలని చూస్తున్నారన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అన్ని వర్గాలకూ న్యాయం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందని ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ తెలిపారు. ఎన్నికల ప్రచారం సభలో ఆమె మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వెనుకబడిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు అన్ని విధాలా అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో హిందూపురం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఇంద్రజ, జిల్లా గొర్రెలు, మేకల కాపరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరసింహాగౌడ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు గంగుల భానుమతి, ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, జెడ్పీటీసీ మారుతిప్రసాద్, పలువురు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి జగన్



ఫ్యాన్‌గుర్తుకు ఓటువేయాలని కోరుతున్న బీఎస్ దిల్షాద్ పర్వీన్ మక్బూల్

కదిరి టౌన్: ప్రతి పథకంలోనూ మహిళలను భాగస్వామ్యం చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని నిరూపించుకున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు పేర్కొన్నారు. మహిళలకు పెద్దపీట వేస్తున్న జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాలని, ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. బుధవారం కదిరి మున్సిపల్ పరిధిలోని 25వ వార్డులో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే మూడో వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. హిందూపురం ఎంపీ అభ్యర్థి శాంతమ్మను, కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ అహ్మద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా, మున్సిపల్ వైస్‌చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ భార్య బీఎస్ దిల్షాద్‌పర్వీన్ మక్బూల్, సింగిల్‌విండో అధ్యక్షులు ఆంజనేయులు, కౌన్సిలర్లు కళ్యాణ్‌కుమార్, మురళి, శంకర్, ఓంప్రకాష్ సలీమ్, రవి, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకే సామాన్యుల మద్దతు



కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన కుటుంబాలు



కుండా చౌడయ్య, కుండా మీనాక్షయ్యల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలోకి చేరిన 90 కుటుంబాలు

- టీడీపీ నుంచి వెల్లువలా వైఎస్సార్‌సీపీ లోకి చేరికలు
- ధర్మవరంలో 305 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి

ధర్మవరం: సకల జనుల సంక్షేమానికి అండగా నిలుస్తున్న వైఎస్సార్‌సీపీ సర్కారుకు సామాన్యులు తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారు. ఈ క్రమంలోనే వైఎస్సార్‌సీపీలోకి చేరికలు వెల్లువెత్తుతున్నాయి. ఐదేళ్ల జనరంజక పాలనకు జై కొడుతున్నారు. బుధవారం ధర్మవరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 27వ వార్డు ఇన్‌చార్జ్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో 215 కుటుంబాలు, 15వ వార్డు కౌన్సిలర్ కుండా చౌడయ్య, వార్డు ఇన్‌చార్జ్ కుండా మీనాక్షయ్యల ఆధ్వర్యంలో 90కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారన్నారు. పట్టణ శివారు ప్రాంతాల్లోని కాలనీల అభివృద్ధికి ఎంతో కృషి చేశామన్నారు. నిరుపేదలందరికీ ఈ ప్రభుత్వంలో 13 వేల ఇంటి పట్టాలు, గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 12వేల మందికి ఇంటి పట్టాలు మంజూరు చేసి సొంతింటి కల సాకారం చేశామన్నారు. కరోనా కష్టకాలంలో చేసేందుకు పనిలేక ఇబ్బందులు పడుతుంటే ప్రతి ఒక్కరికీ నవరత్నాల ద్వారా సంక్షేమ పథకాలను అందించి ఆదుకున్నామన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటివద్దకే వచ్చి సేవలందించారన్నారు. నేతన్న నేస్తం పథకం ద్వారా ఏడాదికి రూ.24 వేల చొప్పున ఐదేళ్ల పాటు చేనేతలకు అందించి మగ్గాలను ఆధునీకరించి మెరుగైన సంపాదన ఆర్జించేలా చర్యలు చేపట్టామన్నారు. పేదలకు మంచి చేయడమే జగనన్న లక్ష్యమని, రానున్న ఎన్నికల్లో ప్రజలంతా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని అఖండ మెజారిటీతో గెలిపిస్తే సంక్షేమం తిరిగి కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు సీలూరి ప్రకాష్, కోటిరెడ్డి బాలిరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు కరీం, కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, పెణుజూరు నాగరాజు, మాసపల్లి సాయికుమార్, చింతా యల్లయ్య, వార్డు ఇన్‌చార్జ్‌లు, నాయకులు తొండమాలరవి, ఎస్‌పీ బాషా, సాదిక్, పెద్దిరెడ్డిగారి శ్రీనివాసులు, అమీర్‌బాషా, చెలిమిపెద్దన్న, ముక్తం మణిదీప్, యంబా తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన వారు వీరే..

27వ వార్డు ఇన్‌చార్జ్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో 215 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరిలో వెంకటేష్, దాదు, సుధాకర్, లక్ష్మీదేవి, గంగాధర్, లక్ష్మీదేవి, వేణుగోపాల్, చెన్నారెడ్డి, పోతులయ్య, కోనప్ప, నాగరత్నమ్మ, కృష్ణమూర్తి, నారాయణమ్మ తదితరులు ఉన్నారు.

- 15వ వార్డు కౌన్సిలర్ కుండా చౌడయ్య, వార్డు ఇన్‌చార్జ్ కుండా మీనాక్షయ్యల ఆధ్వర్యంలో 90 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరిలో శ్రీనివాసులు, నగేశ్, మల్లికార్జున, నాగభూషణ, నాగరాజు, విశ్వనాథ్, శంకర్‌నారాయణ, దేవరాజు, ఆనంద్, రంగస్వామి తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



చంద్రాచర్లలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరిన నేతలు

కనగానపల్లి: మండలంలోని చంద్రాచర్ల గ్రామానికి చెందిన పలువురు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి శాంతమ్మ గ్రామంలో పర్యటించారు. టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ రాయపాటి సాయిరాం, శ్రీరాములు, రాజగోపాల్, రాయపాటి మహేష్, కృష్ణయ్యతో పాటు వారి అనుచరులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి శాంతమ్మ పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. గతంలో టీడీపీకి పట్టున్న ఈ గ్రామంలో కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారే ఎక్కువ మంది టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. పరిటాల సునీతకు గట్టి షాక్ తగిలిందని స్థానికులు చెబుతున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ మారుతి, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, స్థానిక నాయకులు శివారెడ్డి, ఆది, నారాయణస్వామి, మురళీ, సూరి, తదితరులు పాల్గొన్నారు.

పాలనలో తేడా గమనించండి



ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ముదిగుబ్బ: గత పాలన.. ప్రస్తుత పాలనలో తేడా గమనించి ఓటు వేయాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కోరారు. జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకుని మరోమారు జనరంజక పాలనను ఆహ్వానించాలని సూచించారు. బుధవారం మండల పరిధిలోని సిద్ధనగారిపల్లి, ఉప్పలపాడు గ్రామాల్లో ఎమ్మెల్యే ఇంటింటా ప్రచారం చేపట్టారు. సర్పంచ్ లక్ష్మీనారాయణమ్మ, ఎంపీటీసీ లత ఆధ్వర్యంలో నాయకులు బాణసంచా పేల్చి పూలవర్షంతో ఎమ్మెల్యేని స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వివరిస్తూ ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందంటేనే తనను ఆశీర్వదించండని చెప్పిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఒక్కరే అన్నారు.

అబద్ధాల బాబును నమ్మొద్దు

ఎన్నికల వేళ మోసపూరిత వాగ్దానాలు ఇచ్చే చంద్రబాబును ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలు నమ్మరాదని ఎమ్మెల్యే కేతిరెడ్డి సూచించారు. గతంలో వందలాది హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిలో ఒక్కటీ నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో 99 శాతం హామీలు అమలుచేసి ప్రజల గుండెల్లో సీఎం జగన్ సుస్థిర స్థానం ఏర్పరచుకున్నారన్నారు. మరోమారు వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఇందుకూరి నారాయణరెడ్డి, మండల కన్వీనర్ సీపీ నారాయణరెడ్డి, రాళ్లనంతపురం సింగిల్ విండో అధ్యక్షులు బీపీ ఓబిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేంద్రరెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, ద్వారక, నారాయణరెడ్డి, శివారెడ్డి, సేవే నాయక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో పలువురికి చోటు



పదవులు పొందిన నాయకులతో బీఎస్ మక్బూల్ అహ్మద్

గాండ్లపెంట: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అనుబంధ విభాగాల్లో పలువురు నాయకులకు చోటు దక్కింది. బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా జక్కల లక్ష్మీనరసింహగౌడ్, మైనార్టీ విభాగం జిల్లా కార్యదర్శిగా ఎస్.జె.బాహావుద్దీన్, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షులుగా సూర్యనారాయణరెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ కార్యదర్శిగా హుస్సేన్‌పీరా నియమితులయ్యారు. వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధిగా హరిప్రసాద్‌రెడ్డికి అవకాశం లభించింది. ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ ఉపాధ్యక్షులుగా వద్దిరెడ్డి కృష్ణారెడ్డి, యువజన విభాగం మండల ఉపాధ్యక్షులుగా ముజాహిద్, కార్యదర్శిగా ఇలియాజ్, కార్యదర్శిగా ఓబుళరెడ్డి నియమితులయ్యారు. పదవులు పొందిన వారు వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తామని చెప్పారు. పదవులు లభించిన వారిని ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ బుధవారం అభినందించారు.

- గాండ్లపెంట మండలం వంకపల్లికి చెందిన టీడీపీ క్రియాశీల కార్యకర్త రామాంజులరెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, బీసీలకు ఇస్తున్న ప్రాధాన్యం నచ్చి అనుచరులతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నట్లు రామాంజులరెడ్డి తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎన్‌పీకుంట: సోమరాజుకుంట పరిసర ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.1,660 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని చెప్పారు.

బాస్కెట్‌బాల్ జట్లకు ధర్మవరం క్రీడాకారులు



క్రీడాకారులను అభినందిస్తున్న ధర్మాంబ బాస్కెట్ బాల్ అసోసియేషన్ సభ్యులు

ధర్మవరం అర్బన్: జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ ప్రాబబుల్స్ జట్లకు ధర్మవరం బాలబాలికలు ఎంపికయ్యారని ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోని బాస్కెట్‌బాల్ కోర్టులో బుధవారం క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా శెట్టిపి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ జాతీయస్థాయిలో ఏప్రిల్ 9 నుంచి 15 వరకు పాండిచ్చేరి రాష్ట్రంలో రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగే 38వ యూత్ నేషనల్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ బాలబాలికల జట్ల ఎంపిక కోసం ఈ నెల 28 నుంచి ఏప్రిల్ 7 వరకు చిత్తూరులో జరిగే కోచింగ్ క్యాంప్‌కు ధర్మవరం పట్టణానికి చెందిన సల్మా, కిరణ్మయి, బాలుర విభాగంలో విజయ్ ఎంపికయ్యారని తెలిపారు. జాతీయస్థాయి పోటీల్లో రాణించి ధర్మవరం పట్టణానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, కోచ్ సంజయ్ తదితరులు క్రీడాకారులను అభినందించారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మక్బూల్ అహ్మద్

ఇఫ్తార్ విందు

గాండ్లపెంట: మండల కేంద్రంలోని జామియా మసీదులో బుధవారం సాయంత్రం ఇఫ్తార్ విందుకు వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ హాజరయ్యారు. ముస్లింలతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో మసీదు ఇమాం, ప్రభుత్వ ఖాజీ, స్థానికులు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అనుమతి లేకుండా తరలించొద్దు

బత్తలపల్లి: సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యేంత వరకు ఇతర ప్రాంతాలకు నగదు, వస్తువులు తరలింపు విషయంలో అనుమతి తప్పనిసరిగా ఉండాలని స్టాటిస్టికల్ సర్వేలెన్సు టీం సభ్యులు చాముండేశ్వరి, కానిస్టేబుల్ కృష్ణమోహన్ సూచించారు. బుధవారం బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలిలో ఎస్ఎస్ టీమ్ సభ్యులు పలు అనుమానిత వాహనాలను తనిఖీ చేశారు.

కేంద్ర బలగాలతో కవాతు

పుట్టపర్తి టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలు భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించేలా పోలీసులు చర్యలు తీసుకొంటున్నట్లు పుట్టపర్తి రూరల్ సీఐ రాగిరి రామయ్య పేర్కొన్నారు. ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం బుక్కపట్నం ప్రాంతంలో సీఐ రామయ్య, కొత్తచెరువు యూపీఎస్ ఇన్‌స్పెక్టర్ రాజారమేష్, ఎస్ఐ సురేష్ బాబు, కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు.

డీఈఓకు నివేదిక

కదిరి అర్బన్: సున్నపుగుట్ట తండా ప్రాథమిక పాఠశాలలో 'నాడు - నేడు' కింద చేపట్టిన పనుల్లో మిగిలిపోయిన ఇనుప కడ్డీలను అక్రమంగా అమ్ముకునేందుకు ప్రయత్నించిన ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులుపై విచారణ చేసి నివేదికను డీఈఓ మీనాక్షికికు పంపినట్లు ఎంఈఓ చెన్నకృష్ణ తెలిపారు. హెచ్ఎంపై చర్యలు తీసుకోవాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

మృతుల కుటుంబానికి ఆర్థిక సాయం

తాడిమర్రి: శివంపల్లిలో ఇటీవల మృతి చెందిన దేరంగుల ప్రసాద్ (25), వెంకటమ్మల కుటుంబానికి గ్రామానికి చెందిన గంగిరెడ్డిగారి కుళాయిరెడ్డి ఆర్థికసాయం అందించి ఔదార్యం చాటుకున్నారు. ప్రసాద్ భార్య గౌతమికి రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, నారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాకు చర్యలు

బత్తలపల్లి: అనంతసాగరం గ్రామంలో తాగునీటి సరఫరాకు అధికారులు చర్యలు చేపట్టారు. ఎస్సీ కాలనీలో సత్యసాయి నీరు సరఫరా కాలేదని కాలనీవాసులు ఇదివరకు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మీ, ఈఓఆర్డీ దివాకర్, పంచాయతీ కార్యదర్శి గంగరత్నమ్మ బుధవారం గ్రామానికి వెళ్లి పరిశీలించారు. కాలనీలో సత్యసాయి నీరు రాని రోజుల్లో ప్రత్యామ్నాయంగా నీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నారు.

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం

ధర్మవరం అర్బన్: ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. పట్టణంలోని సబ్ జైలు సమీపాన ఈఎస్‌వీఆర్ సేవా ట్రస్ట్ సహకారంతో అంజనశక్తి పశువుల దాణా షాపు నిర్వాహకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం సీఐ ప్రారంభించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని తారకరామాపురంలోని జానకీ రాముల ఆలయ నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి తనవంతుగా రూ.10 వేల విరాళం బుధవారం అందజేశారు.

చెట్టుపై నుంచి పడిన వ్యక్తికి గాయాలు

నల్లచెరువు: రాట్నాలపల్లిలో బుధవారం చింతకాయల కోసం చెట్టు ఎక్కిన నారాయణస్వామి అనే వ్యక్తి పట్టుజారి కిందపడ్డాడు. కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని 108 వాహనంలో కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

అమడగూరు: మండలంలోని కొట్టువారిపల్లి, మలకవారిపల్లి తండా గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను బుధవారం తహసీల్దార్ రామనాథరెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

తాడిమర్రి: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని టాస్క్‌ఫోర్స్ అధికారులు పేర్కొన్నారు. డీఎంహెచ్ఓ కార్యాలయ అకౌంట్ ఆఫీసర్ సుబ్బారావు, సీనియర్ అసిస్టెంట్ నాగరాజు టాస్క్‌ఫోర్స్‌గా ఏర్పడి బుధవారం తాడిమర్రి పీహెచ్‌సీని సందర్శించి టీకాల రికార్డులు పరిశీలించారు. అలాగే వైద్య సిబ్బంది ఇటీవల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు చేసిన రక్త పరీక్షల రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం వారు జెడ్పీహెచ్ఎస్‌కు వెళ్లి విద్యార్థినులకు రక్త పరీక్షలను చేసి గతంలో వైద్య సిబ్బంది నమోదు చేసిన వివరాలను పోల్చి చూశారు.

హుండీ కానుకల లెక్కింపు

రామగిరి: నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో బుధవారం ఆలయ హుండీ కానుకలను లెక్కించారు. రూ.7,11,310 ఆదాయం వచ్చినట్లు అధికారులు నరసింహరాజు, వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బోయ ముత్యాలప్ప, మెంబర్లు చాకలి నాగభూషణ, మంగళి రాధమ్మ, విజయలక్ష్మి, గోపాల్‌నాయక్, రమాదేవి, నాగరాజు, బోయ నారాయణ పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి



రమేష్ (ఫైల్)

నల్లచెరువు: మారిశెట్టిపల్లి వద్ద ఈ నెల 19న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓరువాయి గ్రామానికి చెందిన రమేష్ (33) పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. ఇతడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

తనకల్లు: పోమేనాయక్‌తండాలో బూక్యా నారాయణనాయక్, రవీంద్రనాయక్‌ల వద్ద నుంచి బుధవారం రాత్రి 1640 కర్ణాటక టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ ప్రశాంత్ విజయ్‌కుమార్ తెలిపారు. అయితే పోలీసులను చూసి రవీంద్రనాయక్ పరారయ్యాడన్నారు. నారాయణనాయక్‌ను అరెస్టు చేసినట్లు చెప్పారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం

చెన్నేకొత్తపల్లి: పెనుకొండకు వెళ్లే దారిలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తారని పార్టీ మండల కన్వీనర్ నర్శిరెడ్డి, జెడ్పీటీసీ ఎం.గోవిందరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు



గాండ్లపెంట పరీక్ష కేంద్రం నుంచి వస్తున్న విద్యార్థులు

సాక్షి నెట్‌వర్క్ : పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లోని పరీక్ష కేంద్రాల్లో జరిగిన పరీక్షలను అధికారులు తనిఖీ చేశారు. చివరి రోజు సోషల్ పరీక్ష ముగియగానే విద్యార్థులు ఆనందంతో కేరింతలు కొట్టారు.